# గుర్తులేని గతం



-భుస్సా బాలచందర్

తూర్పున ఉదయించిన బాల భానుని పసిడి కిరణాలు ధగధగ మెరిసిపోతున్నాయి.

కాజీపేట్ రైల్వే ప్లాట్‌ఫారం పాసెంజర్లతో రద్దీగా ఉంది. విజయవాడ వెళ్ళే రైలు రావడానికి దాదాపు పదిహేను నిమిషాలు కావాలి. పాసెంజర్లు సామానులు సర్దుకుని ప్లాట్‌ఫారంపై నిలబడి ఆత్రతగా ఎదిరి చూస్తున్నారు.

రైల్వే ప్లాట్‌ఫారం దగ్గర వివిధ రకాల పండ్లు అమ్మే అశోక్ గంట క్రితం నుండి పుస్తకాల షాపు వద్ద నిలబడి ఉన్న అబ్బాయి వైపు చూస్తూ ఆలోచనలతో సతమత మవుతున్నాడు.

ఆ అబ్బాయి విసుగూ విచారంతో, ఏదో పోగొట్టుకున్న హృదయంతో ఉన్నాడు. చేతిలో ఫైలు తప్ప ఏమీ లేదు. అతను కూడా విజయవాడ రైలుకోసం ఎదిరిచూస్తున్నట్లున్నాడు కాబోలు.

అశోక్‌కు ఆ అబ్బాయి కాస్త తెలుసు. పరిచయం ఎక్కువగా లేదు. ముఖ పరిచయం వరకే. బాహ్య రూపం తెలియక పోయినా అంతర్గత రూపం తెలుసు.

పండ్ల బండిని తోసుకుంటూ ఆ అబ్బాయి వైపు వెళ్ళాడు. పలకరింపుగా నవ్వాడు అతన్ని చూసి. ఆ అబ్బాయి చూసి కూడా చూడనట్లుగా తల పక్కకు తిప్పుకున్నాడు.

"మీరు విజయవాడ వెళుతున్నారా?" స్వయంగా పలకరించాడు.

"అవును."

"మీరు ఆర్. ఇ. సి. లో కదా ఉండేది?"

"అవును." విసుగుతో అన్నాడు ఆ మాట.

"ఎమ్ 3/3 బిల్డింగ్?"

"అవును."

"నేనుకూడా ఆర్. ఇ. సి. రోడ్డు పక్క వీధిలో ఉంటున్నాను."

మాట్లాడలేదు. మవునంగా ఉన్నాడు ఆ అబ్బాయి.

"నేను మిమ్మల్ని చాలాసార్లు చూశాను. బహుశా మీరుకూడా నన్ను చూసి ఉంటా రనుకుంటా? ఇంతకూ మీ పేరు?"

"వేణు."

"నా పేరు అశోక్" పరిచయం చేసుకున్నాడు.

"పూరెళ్ళి ఎప్పుడు వచ్చేస్తారు?" సమాధానం కోసం ఎదిరి చూశాడు.

ఇంతలో పండ్లకొరకు వచ్చిన వ్యక్తులకు పండ్లు ఇచ్చి పంపేశాడు అశోక్.

"ఏమో?" ముక్తసరిగా అని పక్కకు జరిగాడు.

"మీరు బి. కామ్. పాసయ్యా రనుకుంటాను."

"అవును."

"మీ రిజల్ట్ వచ్చిన నాడు నేను ఆర్. ఇ. సి. రోడ్డు పక్క వీధిలోకి అద్దెకు వచ్చాను. అందువల్ల తెలిసింది."

వేణు ఏదో ఆలోచిస్తూ అశోక్ మాటలు పెడ చెవిని పెట్టి సినిమా పోస్టర్ల వంక తదేకంగా చూస్తున్నాడు.

"ఇంటర్వ్యూకు వెళుతున్నారా?"

"కాదు." అశోక్ వంక చూడనైనా చూడకుండా సమాధానం ఇచ్చాడు వేణు.

"బాంకు పరీక్షకు అప్లై చేశారు కదా? మా ఇంటి ఓనర్ కొడుకు చెప్పాడు. మీ రిద్దరూ కలిసి

దువుకున్నారట. కలిసి అప్లై చేశారని."

"అలాగా!" మాట్లాడకుండా ఉంటే సిగ్గు చేటుగా, అవమానకరంగా ఉంటుందనుకొని మెల్లిగా పలికాడు.

"అప్పుడప్పుడు మీ గురించి చెబుతూ ఉంటాడు."

పేరు, వివరాలు తెలిసి కూడా కావాలని తనతో మాట కలపాలని పరిచయం చేసుకున్నాడని క్షణంలో గ్రహించాడు.

"విజయవాడలో ఎక్కడ ఉంటారు? ఎవరైనా రిలేటివ్స్ ఉన్నారా?" అని అడిగాడు అశోక్.

"నాకు తెలవదు."

"అదేం?!" ఆశ్చర్యంగా అన్నాడు అశోక్.

క్షణం ఆలోచించాడు వేణు. బాబాయి మీద కోపం వచ్చింది—తనను అనరాని మాటలు అన్నందుకు.

"మా బాబాయి తప్పు అంతా ఈ పరిస్థితికి దిగజారటానికి."

"అంటే?"

"జీవితం అంటే ఏమో తెలియని మా బాబాయికి కొడుకుల్ని ఎలా పెంచాలో తెలియదు." ఉద్రేకంతో అన్నాడు.

"కోపంగా ఉన్నట్లున్నారు మీరు."

ఏమీ మాట్లాడ లేదు వేణు.

"ఇంట్లో మీ బాబాయితో తగవు పెట్టుకుని పోతున్నారా?"

"కాదు. హాయిగా బ్రతకడానికి వెళుతున్నాను. లయ [illegible] ఆశ్రయం లేకపోతే క్రుంగి కృశించి నశి[illegible]డనుకున్నారేమో? కూలి చేసుకునైనా బ్రతకగలను." ఆవేశంతో అన్నాడు వేణు.

"బాబాయికి చెప్పి వచ్చావా?" అనుమానంతో అడిగాడు అశోక్.

"వెళ్ళిపొమ్మన్నారు."

"చూడు, వేణూ! నాకు తెలిసినంతవరకు కొడుకును ఏ తండ్రి కూడా ఇంట్లోనుండి వెళ్ళిపొమ్మనడం జరగదు. ఏదో ఒక టార్గెట్‌తో జీవిత నావను తోసుకెళ్ళా అంటాడు. నీ వేమో వెళ్ళిపొమ్మన్నాడు అంటున్నావు."

మవునంగా ఉండిపోయాడు వేణు.

"అసలు ఎందుకు తగవులాట వచ్చింది?"

"ముందే ముసలివాళ్ళు. చావడానికి వయసు వచ్చినా చెపితే వినరు, వారికి తెలియదు. వారు అన్నది అక్షరాలా పాటించాలి. లేకపోతే తిట్లు ..."

"దేనికివచ్చింది తగవులాట?" అడిగాడు అశోక్.


"నా ఫ్రెండ్‌కు ఎమర్జెన్సీ వర్క్ ఉండి నా సైకిల్ అడిగితే ఇచ్చాను. ఏదని అడిగాడు. చెప్పాను. వినలేదు. ఇక మొదలైంది రణరంగం. వూరకే కూర్చుండితింటూ అంటే గుట్టలయినా తరుగుతాయి. ఏదయినాపనిచూసుకుని ఏడు అన్నాడు." గంభీరంగా అన్నాడు వేణు.

"ఆ తర్వాత?"

"తిండిపెట్టడం కష్టంగా ఉంటే పొమ్మనరాదా? అన్నాను. నీ కంత ఇష్టముంటే బయటికి ఇప్పుడు వెళ్ళమన్నారు కోపంగా. వచ్చేశాను."

"ఇంత చిన్న కారణానికే వచ్చేశారా?" ఆశ్చర్యంగా అడిగాడు అశోక్.

"ఈ చిన్న కారణం అయితే వచ్చేవాణ్ణి కాదు.




అసలు విసిగిపోయాను. నేను. బి.కామ్. పూర్తి అయిన నుంచి చూస్తున్నాను. నేనేదో పనిలేకుండా వూరకే కూర్చొని అనుకుంటున్నానని ఉద్యోగ ప్రయత్నం చేయటం లేదని...ఆయన అనుమానం. మాటి మాటికీ మాటలు అంటూనే ఉంటారు."

కర్చీఫ్‌తో మొహంతుడుచుకుని మళ్ళీ మొదలపెట్టాడు.

"నాకు ఇక ఆ ఇంట్లో ఉండడం కంటే నరకం మరొకటి లేదు.

ఆ స్థితికితీసుకువచ్చారు నన్ను. చిన్న ఉద్యోగం దొరికినా చాలని చూస్తున్నాను. దొరకగానే వెళ్ళి పోదామని నిశ్చయించుకున్నాను.

కాని, ఆయనే దారి చూపారు ఇంట్లోంచి వెళ్ళి పొమ్మని." సుదీర్ఘంగా మాట్లాడి శ్వాస పీల్చుకున్నాడు వేణు.

"విజయవాడ వెళ్ళి ఏం చేస్తావ్?" అడిగాడు అశోక్.

"ఉద్యోగ ప్రయత్నం చేస్తాను.

"ప్రయత్నం ఫలించకపోతే?" ప్రశ్నించాడు అశోక్.

ప్రశ్నకుసమాధానంగా వేణు "నా బ్రతుకు నేను బ్రతకలేకపోను, అంతపెద్ద పట్టణంలో" అన్నాడు.

అశోక్ పెదవులపై చిరు దరహాసం మెదిలింది.

"సామాను తీసుకు వెళ్ళడం లేదా?" అడిగాడు అశోక్.

"లేదు."

"కట్టు బట్టలతో ఇలాగే వెళ్ళిపోతున్నారా?"

"అవును."

"చూడు, మీరు ఏమీ అనుకోకపోతే నే నో మాట చెపుతాను. వింటారా?"

"చెప్పండి" అన్నాడు వేణు.

"ఇప్పుడువిజయవాడవెళ్ళగానే ఎక్కడఉంటార ? ఉండేందుకు చోటుదొరకదు. నిలువ నీడా ఉండదు"

"తెలుసు."

"అంతేకాదు. ఆ పట్టణంలో మీలాంటి వాళ్ళు నెగ్గుకు రాలేరు. మీ చదువుకు తగ్గ ఉద్యోగం దొరకదు వెంటనే. దొరుకుతుందని ఆశతో వెళితే చివరికి నిరాశతో చాలాఇబ్బంది పడతారు. నేనుకూడా మీలాగనే చిన్నప్పుడు పారిపోయి వచ్చిన వాణ్ణే."

పండ్లకొరకు వచ్చిన వ్యక్తులకు పండ్లు ఇచ్చి వేణు వంకచూసి మళ్ళీ మొదలుపెట్టాడు అశోక్.

"చాలా అవస్థలు పడ్డాను, చివరికి రాళ్ళుకూడా మోశాను. ఇతిరిగి ఇంటికి వెళ్ళ బుద్ధికాలేదు."

"చిన్న ఉద్యోగం దొరక్క పోదు!" నిరాశతో అన్నాడు వేణు.

వేణు మాటల్లో ఏమాత్రం నమ్మకంలేదని గ్రహించాడు అశోక్.

"అసలు మీకు ఏమీ తెలియదు. ఇంట్లోనే మరి కొన్ని రోజులుంటే బాగుంటుంది. ఎంత చిన్న ఉద్యోగమయినా సరే —వచ్చిన తర్వాత హాయిగా వెళ్ళండి. నా మాటలు వినకుండా మొండిగా ప్రవర్తించారంటే ఉద్యోగం దొరకకపోగా, మీరు చేయకూడని చిన్న చిన్న పనులు చేయవలసి వస్తుంది. కష్టంగా బ్రతుకవలసి వస్తుంది."

కొద్ది ఆలోచనలో పడ్డాడు వేణు. ఆలోచనల్ని పసిగట్టాడు అశోక్.

"టికెట్ కొన్నారా?" అని అడిగాడు.

కొన్నా నన్నట్లు తల వూపాడు వేణు. చేతుల్ని గిల్లుకుంటూ నిలబడడం వల్ల వ్రేలికి గోల్డ్ రింగ్ లేకపోయేసరికి అశోక్‌కు అర్థమయింది.

"డబ్బెక్కడిది?" ప్రశ్నించాడు అశోక్.

మవునం వహించి తల పక్కకు తిప్పుకున్నాడు వేణు.

"గోల్డ్ రింగ్ ద్వారా వచ్చింది కదూ?"

వేణు సిగ్గుతో తల వంచుకున్నాడు తనంటే బాధపడే, ఆప్యాయత కనబరిచే అశోక్ అంటే చెప్ప రాని అభిమానం కలిగింది. తన స్నేహితుడుగా, సోదరుడుగా హృదయంలోనే గుర్తించాడు.

"తాకట్టు పెట్టారా? అమ్మేశారా?"

"తాకట్టు పెట్టాను."

నయమవు
తుంది

వాడండ
హ్యాలెట్స్
మిక్స్చర్

స్టీల్ హౌస్
కాంగ్రెస్ ఆఫీసు ప్రక్కన
విజయవాడ-2. ఫోన్: 74893
ప్రెస్టేజ్ ప్రెషర్ కుక్కర్స్ కు ఆథరైజ్డ్ డీలర్లు
అన్నిరకముల ప్రెషర్ కుక్కర్లకు
సర్వీసింగ్ సౌకర్యము కలదు.
అధునాతనమైన పలురకముల
స్టెయిన్ లెస్ స్టీలు సామానులు
సరసమైన ధరలకు లభించును
మరియు 'ప్రియ' పచ్చళ్లు

లతకు పందిరే
అందం.....
మహిళకు
శ్రీ
TRADE MARK

22 ct. బంగారు
కవరింగ్
చేయబడినవి
ఆభరణములే
అందం
PHONES.
235, RESI: 785.
nirmala
తయారుచేయువారు:
శ్రీ గోల్డు కవరింగ్ వర్క్సు Regd
P.B.No. 35. శ్రీ మహల్, మచిలీపట్నం. A.P
* మా సెల్లింగు బ్రాంచీలు *
1. పట్టాభి మార్కెట్.......మచిలీపట్నం
2. శేషయ్య వీధి.........విజయవాడ-1
3. ట్రంకు రోడ్డు..........నెల్లూరు
4. 6 కార్ స్ట్రీట్.........తిరుపతి
5. గాంధీ రోడ్డు..........తిరుపతి
6. సుభాష్ రోడ్డు.......అనంతపురం
7. ఎవెన్యూ రోడ్డు.......బెంగుళూరు
8. గాంధీ బజారు.......బెంగుళూరు
9. గాంధీ బజారు.........షిమోగా
10. మునిసిపల్ మార్కెట్.......కర్నూలు
11. జయంతి బిల్డింగ్స్.......బెంగుళూరు
12. మద్రాసు రోడ్డు..........కడప
13. రామన్ కోయిల్ స్ట్రీట్.....చిత్తూరు
14. నాగులకుంటరోడ్డు...నంద్యాల
15. గాంధివిగ్రహంవద్ద . నర్సరావుపేట

"హమ్మయ్య బ్రతికించారు. టికెట్ కాన్సిల్ చేద్దాం, తాకట్టు విడిపిద్దాం."

"లేదు — లేదు. నేను వెళ్ళాలి!" ఆందోళనగా అన్నాడు వేణు. కాని, మనసులో చోటుచేసుకున్న పది క్షణాల క్రితం ఉన్న అతని పట్టుదల, తప్పకుండా వెళ్ళాలనే ఆలోచన అల్లంత దూరంలో ఉంచాడు. తన మిత్రుని మాటలు తనకు పునాది రాళ్ళుగా కనబడ్డాయి. ఆ పునాది రాళ్ళతోనే జీవిత నావను ముందుకు ఉరికించాలనే తపన వేణులో ఉప్పొంగింది.

"వెళ్ళాలంటే తప్పకుండా వెళ్ళండి—ఈ రోజు మాత్రం కాదు. రేపు ఇదే సమయానికి వెళుదురుగాని. అంతవరకు మా ఇంట్లో ఉండండి" అన్నాడు అశోక్.

"దేనికి రేపటిదాకా ఉండడం?" అడిగాడు వేణు.

"దేనికంటే, రేపీ పాటికి మీ బాబాయిగారి మీదున్న కోపం అంతా పటాపంచ లవుతుంది. కోపం తగ్గితే ఆలోచనా శక్తి పెరిగి, ఇల్లు విడిచి పారిపోవడం ఎంత సిగ్గుచేటో, మూర్ఖత్వమో మీరే తెలుసుకో గలరు."

'అవునా?' అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు వేణు అశోక్ వైపు.

"నేనంటే మా బాబాయికి లోకువ."

"లోకువ కాదు. ఆయన తప్పులేదు. మీ అక్కయ్యకు పెళ్ళికావాలా? చెల్లిని చదివించాలా? తమ్ముణ్ణి అభివృద్ధిలోకి తీసుకురావాలా? ఇంత భారం ఆయన భరించాలా? కన్న కొడుకు మీద కాకుంటే ఎవరి మీద కోపగించుకోవాలి? చేతికి అందిన వాడినని అన్నాడు. నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకొని జీవిస్తున్నారో చెప్పండి?" ఎత్తిపొడుపుగా అశోక్ అన్నాడు.

వేణు ఆలోచనలో ఉండిపోయాడు. ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

"రైలు ఇంకా రాలేదు. లేకుంటే ఎప్పుడో విజయవాడ రైలు ఎక్కేసేవారు!"

"అయితే టిక్కెట్ కాన్సిల్ చేయకపోతే కుదరదా?" వేణు అసహాయంగా అన్నాడు.

ఏమాత్రం ఇష్టం లేదనే భావానికి తీసుకువచ్చాడు అశోక్.

"తప్పదు. ఇంకో పావుగంటలో నేను పళ్ళ బండి మా దోస్త్ దుకాణం వద్ద అప్పచెప్పి వస్తాను. ఈ లోగా టికెట్ కాన్సిల్ చేసి, బయట ఉన్న పుస్తకాల షాపు వద్ద ఉండండి"

"అలాగే."

"రైలు వచ్చే టైమయింది. తొందరగా వెళ్ళండి!"

చకచక సాగిపోతున్న వేణు వంక చూసి, బండి కదిలించాడు అశోక్.

బండి కదిలించినా అశోక్ మనసు వేణు మీదే ఉంది, రైలు ఎక్కుతాడేమోనని.

తమాయించుకుని బండి తోసుకుంటూ వెళ్ళి పావుగంటలో పుస్తకాల షాపు వద్దకు వచ్చాడు అశోక్.

వేణు ఆలోచనతో షాపు పక్క ఉన్న మెట్లు మీద కూర్చున్నాడు.

'పదండి' అన్నాడు అశోక్.

ఇద్దరూ ముందుకు నడిచారు.

అశోక్ గోల్డ్ రింగ్‌ను తాకట్టు నుండి విడిపించాడు. అశోక్ వేణును ఇంటి వద్ద విడిచి, అతని తండ్రికి ఏ పరిస్థితులలో వేణు మనసు మార్చింది వివరించి, బాధపెట్టవద్దని, నిరాశ పరచవద్దని చెప్పాడు.

క్రోధంగా మాట్లాడినా, చివరికి ఆయనను చల్లబరిచాడు.

హాయిగా ఆ ఇంటి నుంచి బయట పడ్డాడు అశోక్.

కొన్ని రోజుల తర్వాత వేణుకు ఉద్యోగం హైదరాబాదులో వచ్చిందని అశోక్‌కు చెప్పాడు వేణుతండ్రి.

సంతోషంతో గగనాకాశంలో ఉప్పొంగిపోయాడు అశోక్.

*　　　*　　　*

కాలచక్రం చకచక సాగిపోతూంది.

నాలుగు సంవత్సరాలు గడిచాయి. ఒక రోజున, మామూలుగా పండ్ల బండి తోసుకు వెళుతున్నాడు అశోక్, ప్లాట్‌ఫారం వద్దనుండి.

కొద్ది క్షణాల క్రితం హైదరాబాదునుండి వచ్చిన రైలు వద్ద దాదాపు పదిమంది ఆత్రతగా ఉన్నారు. చేతుల్లో పూల దండలతో ఆసక్తితో చూస్తున్నారు.

ఏ మంత్రిగారో అయి ఉండవచ్చునని కుతూహలంతో అటువైపు వెళ్ళాడు అశోక్.

గంభీరంగా ఫుల్ సూట్‌లో, హుందాగా ఆ మనిషి గుంపు మధ్య నిలుచున్నాడు.

అశోక్ ఆ వ్యక్తి ఎవరో గుర్తుపట్టాడు. తనూ వాళ్ళ పక్క నిలబడి చప్పట్లు కొట్టాడు.

సంతోషంతో పూల దండలు వేస్తున్నారు అందరూ.

"ఎవరు ఆయన?" సంతోషం ఆపుకోలేక పక్క వ్యక్తిని అడిగాడు అశోక్.

"ఎవరయితే నీ కెందుకు?" విసురుగా అన్నాడా వ్యక్తి.

కుతూహలం ఆపుకోలేక "సినిమా ఏక్టరా?" అని ప్రశ్నించాడు.

"కాదు — కలెక్టర్."

తనే కలెక్టర్ అయినంత సంతోషించాడు అశోక్. కళ్ళు మిరుమిట్లు గొల్పాయి. తన కళ్ళు తనే నమ్మలేకపోయాడు. ఆనందంతో పరవశించ సాగాడు అశోక్.

"వేణూ! కలెక్టర్ వయ్యావని ఇప్పుడే విన్నాను. చాలా సంతోషం."

'ఎవరూ!' అన్నట్టు చూశాడు వేణు. కలెక్టర్‌ని పేరు పెట్టి సంబోధించేంత ధైర్యం గల ఇతనెవరా అన్నట్టు చూస్తున్నారు మిగతా వాళ్ళు.

"నేను — నేను అశోక్‌ని." ఆత్రతతో అన్నాడు అశోక్.

వేణు పట్టించుకోకుండా పూల దండ వేస్తున్న మరొక ఆయనతో కరచాలనం చేశాడు.

"మరిచిపోయావా?" మళ్ళీ ప్రశ్నించాడు కళ్ళనీళ్ళు దిగ మింగుకుంటూ అశోక్. అశోక్ చాపిన చెయ్యి పక్కకు తోసేసి మరో పెద్ద మనిషి చెయ్యితో కరచాలనం చేశాడు వేణు.

కళ్ళనీళ్ళు వత్తుకుంటూ గుంపు నుంచి బయట పడ్డాడు అశోక్. 'అహం కూడా ఈ లోకంలో సృష్టించావా, భగవంతుడా!' అని మనసులో అనుకున్నాడు.

*